క్లుప్తంగా

తుపాను నష్టాల అంచనాపై శిక్షణ


శిక్షణలో మాట్లాడుతున్న నారాయణమూర్తి

కొత్తపల్లి: తుపాను వల్ల నష్టపోయిన ప్రతి రైతును గుర్తించాలని డీఎల్‌డీఓ పాఠంశెట్టి నారాయణమూర్తి అన్నారు. గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మిచాంగ్ తుపానుకు సంబంధించి పంట నష్టం అంచనా వేసేందుకు ఏర్పాటు చేసిన కమిటీలకు శిక్షణ ఇచ్చారు. ప్రతి కమిటీ పూర్తి స్థాయిలో నష్టాన్ని గుర్తించాలన్నారు. తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంఏఓ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన

పెద్దాపురం: కనీస వేతనాలు అమలు చేయాలంటూ ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయం వద్ద మంగళవారం అంగన్‌వాడీ వర్కర్లు సమ్మె చేశారు. ప్రాజెక్టు పరిధిలోని 283 అంగన్‌వాడీ కేంద్రాలను వారు సమ్మె బాట పట్టారు. యూనియన్ నాయకులు దాడి బేబీ, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

రీసర్వే అభ్యంతరాలపై దృష్టి


రీసర్వేపై సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీఓ

పిఠాపురం: జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష రీసర్వేకు సంబంధించి అధికారులు దృష్టి పెట్టాలని ఆర్డీఓ కిషోర్ అన్నారు. గొల్లప్రోలు తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రీసర్వేపై రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో సర్వే పూర్తయిన గ్రామాల్లో రీసర్వేకి సంబంధించి భూ విస్తీర్ణం, నంబర్లకు సంబంధించి రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. గ్రామ సచివాలయాల్లో రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు అందుబాటులోఉండి, అభ్యంతరాలపై దరఖాస్తులను స్వీకరించాలన్నారు. జెడ్పీటీసీ ఉలవ కాయల నాగలోవరాజు, తహసీల్దార్ బి. వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

ఐక్యతకు వన సమారాధనలు దోహదం

పెద్దాపురం: కుటుంబాల్లో ఐక్యతను చాటేందుకు కార్తిక వన సమారాధనలు దోహదపడతాయని నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు రాకుర్తి పుల్లయ్య, తమిరి శ్రీను అన్నారు. పట్టణంలో మంగళవారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కొమ్మన అమ్మన్న, పసుపులేటి నాగబాబు, బైలపూడి సూరిబాబు, బైలపూడి త్రిమూర్తులు నాయి బ్రాహ్మణ సంఘాల సభ్యులు పాల్గొన్నారు. పలువురు సీనియర్లను సన్మానించారు.

అరటి వ్యాపారి మృతి

కొత్తపల్లి: నాలుగు వాహనాలు వరుసగా ఢీకొన్న సంఘటనలో ఓ అరటిపండ్ల వ్యాపారి చనిపోగా, ముగ్గురికి గాయాలయ్యాయి. సామర్లకోట–పిఠాపురం రోడ్డులో మంగళవారం ఈ ప్రమాదం జరిగింది. పిఠాపురం రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కందాడ వద్ద సామర్లకోట నుంచి పిఠాపురం వైపు వస్తున్న ఆటోను వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. ఆటో అదుపుతప్పి మోటార్ బైక్‌ను, ఆ బైక్ మరో సైకిల్‌ను ఢీకొన్నాయి. అరటి గెలలతో సైకిల్‌పై వెళుతున్న కందరాడకు చెందిన వ్యాపారి వాక పల్లి అర్జునరావు(55) తీవ్రంగా గాయపడి మరణించాడు. ఆటో ప్రయాణికుడు విరవకు చెందిన సకుమళ్ల అంజయ్య, బైక్ వెనుక కూర్చున్న పి.వేమవరం గ్రామానికి చెందిన వై.పశువులరావుతో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఎస్సై గుణశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

కొత్తపల్లి: హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్టు పిఠాపురం పట్టణ పోలీసులు మంగళవారం తెలిపారు. వారి వివరాల ప్రకారం.. పిఠాపురంలోని జగ్గయ్యచెరువుకు చెందిన నల్లాడ లక్ష్మణరావు(41) హత్యకు గురైనట్టు అతడి సోదరుడు సూర్యప్రకాష్‌కు స్థానికులు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు డిసెంబర్ ఒకటో తేదీన సూర్యప్రకాష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్పీ సతీషకుమార్, డీఎస్పీ మురళీ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు సీఐ శ్రీనివాసు, ఎస్సై మురళీమోహన్ కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడి సెల్‌ఫోన్, ద్విచక్ర వాహనం కనిపించకపోవడంతో, ఆ కోణంలో దర్యాప్తు చేశారు. మంగళవారం ఉదయం జగ్గయ్య చెరువుకు చెందిన వందే సాయిని అరెస్టు చేసి, విచారణ చేయడంతో, ఆ హత్య చేసినట్టు అంగీకరించాడు. కాగా లక్ష్మణరావు, సాయి కలిసి అదే ప్రాంతంలో మూడేళ్ల క్రితం నూడిల్స్ దుకాణం పెట్టారు. లాభసాటిగా లేక పోవడంతో దుకాణం మూసేశారు. దుకాణం సామాన్లను లక్ష్మణరావు తీసుకెళ్లిపోయాడు. అప్పటి నుంచి వీరి మధ్య మనస్పర్థలు నెలకొన్నాయి. అప్పుడప్పుడు వీరిద్దరూ కలిసి మద్యం సేవించేవారు. గత నెల 27న రాత్రి ఇద్దరూ కలిసి లక్ష్మణరావు ఇంట్లో మద్యం తాగారు. ఆ సమయంలో సాయి చెల్లిపై లక్ష్మణరావు అసభ్యంగా మాట్లాడాడు. దీనిని తట్టుకోలేని సాయి పక్కనున్న సుత్తితో తలపై రెండు సార్లు మోది, చాకుతో పీక కోసి పరారయ్యాడు. నిందితుడిని కోర్టులో హాజరు పరుస్తామని పోలీసులు తెలిపారు.

వైభవంగా కార్తిక మాసోత్సవాలు

- దీపారాధన సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నదానం
- నెల్లాళ్లూ వైభవంగా సాగిన పూజా కార్యక్రమాలు
- నేటితో ముగియనున్న ఉత్సవాలు


దీపాలంకరణలో పంచారామ క్షేత్రం


దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న దవులూరి దొరబాబు


అన్నదానాన్ని ప్రారంభించిన ఈఓ తదితరులు


పంచారామ క్షేత్రంలో స్వామి వారు

సామర్లకోట: కార్తిక మాసం ముగింపు సందర్భంగా అమావాస్యను పురస్కరించుకొని ఆలయ దీపారాధన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం భారీ అన్నదానం నిర్వహించారు. స్థానిక పంచారామ క్షేత్రమైన బాలత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయంలో దీపావళి వెళ్లిన మరుసటి రోజు నుంచి కార్తిక ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో సుమారు 10 వేల మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. ఈఓ టీవీ సూర్యనారాయణ, దీపారాధన సంఘ నాయకులు అప్పల బ్రహ్మానందం, శ్రీనివాసు, శ్రీధర్, బీవీవీ సత్యనారాయణ భక్త సంఘం నాయకుడు బిక్కిన సాయి ప్రారంభించారు. ఆలయ సిబ్బంది, ట్రస్టు బోర్డు సభ్యులు, కౌన్సిలర్ నేతల హరిబాబు, భక్త సంఘం నాయకులు మసకపల్లి సత్యనారాయణ, బీవీ రమణ, చల్లా సత్తిబాబు తదితరులు భక్తులకు సేవలందించారు. సాయంత్రం స్వామి వారిని అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. బుధవారం పోలి పాడ్యమిని పురస్కరించుకుని ఆలయాన్ని పూలతో అలంకరించి, స్వామివారిని జటాజూటంతో అలంకరిస్తారు. ఈ అలంకరణతో కార్తిక మాస ఉత్సవాలు ముగుస్తాయి. కాగా ఈ మాసంలో సోమవారం వరకు సుమారు ఐదు లక్షల మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారని ఈఓ తెలిపారు. పూజా రుసుములు, లక్షపత్రి పూజల టిక్కెట్ల ద్వారా రూ.51,01,171, అన్నదానానికి విరాళాలుగా రూ. 20,80,590 ఆదాయం వచ్చిందన్నారు.

వైభవంగా కోటి దీపోత్సవం

మంగళవారం రాత్రి రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దవులూరి దొరబాబు కోటి దీపోత్సవాన్ని ప్రారంభించారు. క్షేత్రంలోని ఉప ఆలయమైన గణపతి ఆలయంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు, ఈఓ టీవీ సూర్యనారాయణతో కలసి పూజలు చేసి ఆయన దీపాలు వెలిగించి దీపోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయంలోని మొదటి అంతస్తు, దిగువ భాగంలోని స్తంభాలు, ఆలయ గోడల చుట్టూ దీపాలను భక్తులు ఏర్పాటు చేశారు. కర్పూరంతో కాగితపు బెలూన్‌లో వెలిగించిన ఆకాశ దీపం ఎంతగానో ఆకట్టుకుంది. సీఐ డి.సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

శివలింగాలకు ఘనంగా పంచామృతాభిషేకాలు


లక్ష బిల్వార్చనకు హాజరైన భక్తులు

పిఠాపురం: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ కుక్కుటేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసం సందర్భంగా సోమవారం రాత్రి 108 శివలింగాలతో లక్షార్చన పూజను నిర్వహించారు. అధిక సంఖ్యలో మాల ధరించిన శివభక్తులు పాల్గొన్నారు. శివలింగానికి పంచామృత అభిషేకాలను ద్విభాష్యం సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన మంచు శివలింగం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పాదగయ క్షేత్రం భక్తులతో కోలాహలంగా మారింది. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకున్నారు. ఉమా కుక్కుటేశ్వరస్వామి, పురుహూతికా అమ్మవారిని, దత్తాత్రేయస్వామిని దర్శించుకున్నారు.


పాదగయ క్షేత్రంలో పోటెత్తిన భక్తులు


ఆకట్టుకున్న మంచు లింగం

క్యాన్సర్ వైద్య శిబిరానికి అపూర్వ స్పందన


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ పద్మనాభం

సామర్లకోట: స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద ఉన్న పూర్ణా కల్యాణ మండపంలో మంగళవారం గుణ్ణం చంద్రమౌళి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం ఈ శిబిరాన్ని ప్రారంభించారు. హైదరాబాద్ నుంచి రెండు ప్రత్యేక బస్సులలో వచ్చిన రోగులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరం నిర్వాహకుడు చంద్రమౌళి మాట్లాడుతూ బుధవారం కూడా ఈ శిబిరం సాగుతుందన్నారు. పేదల కోసం తమ ట్రస్టు పని చేస్తుందని, వారి కోసం ఏటా రూ.10 లక్షలు ఖర్చు చేయనున్నట్టు ఆయన తెలిపారు. మాజీ ఎంపీపీ కొండపల్లి కృష్ణమూర్తి, డాక్టర్ పసల సత్యానందరావు, మాజీ మున్సిపల్ చైర్మన్లు రాజా సూరిబాబు రాజు, గోలి వెంకటఅప్పారావు చౌదరి తదితరులతో పాటు హైదరాబాద్, బెంగుళూరు, కాకినాడకు చెందిన వైద్యులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే పెండెం దొరబాబు


క్రీడా కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: యువతీయువకులు, విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని, వారిలో దాగున్న క్రీడా నైపుణ్యం వెలికితీసేందుకే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా కిట్లను పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే అందించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గ్రామ సచివాలయాల్లో మండల స్థాయి పోటీలు నిర్వహిస్తారన్నారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు ఎంపికలు ఉంటాయన్నారు. ఈ నెల 15 నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఈ పోటీల్లో క్రికెట్, వాలీబాల్, షటిల్, మహిళలకు రింగ్ పోటీలు జరుగుతాయని చెప్పారు. పిఠాపురం పట్టణంలో బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించేలా క్రీడా మైదానాన్ని రూ.78 లక్షలతో అభివృద్ధి చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, జెడ్పీటీసీ బుర్రా అనుబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జవ్వాది నాయుడు, ఎంపీడీఓ బి.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం తథ్యం


తిరుపతికి పాదయాత్రగా వెళ్తున్న దొరబాబు

పెద్దాపురం: రాష్ట్ర ముఖ్యమంత్రిగా 2024లోనూ వైఎస్సార్ సీపీ విజయం సాధించాలని కోరుతూ ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు చేపట్టిన ఏడు రోజుల పాదయాత్ర దీక్ష మంగళవారం దిగ్విజయంగా తిరుపతి శృంగార వల్లభస్వామి ఆలయానికి సాగింది. అయ్యారక కార్పొరేషన్ చైర్మన్ అవాల రాజేశ్వరి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, రాష్ట్ర కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, పెద్దాపురం, సామర్లకోట మున్సిపల్ వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయి ప్రసాద్, ఊబా జాన్ మోజెస్, ఏఎంసీ చైర్మన్ వల్లూరి జ్యోతి, వైస్ చైర్మన్ బందారు వీరబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, పార్టీ కార్యకర్తలు ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి, చైర్మన్ కర్రి జగదీష్, ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, వేద పండితులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి మరిన్ని సంక్షేమ పథకాలతో మరో 20 ఏళ్లపాటు కొనసాగాలని పూజలు చేశారు. రాష్ట్ర చరిత్రను మలుపు తిప్పిన జగన్ పాదయాత్రలో ప్రజల కష్టాలు తెలుసుకుని వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలతో వారి గుండెల్లో స్థానం సుస్థిరం చేసుకున్నారన్నారు. కౌన్సిలర్లు, సర్పంచ్‌లు తదితర నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పటిష్ట ఓటరు జాబితాకు సహకరించండి

- క్లెయిమ్‌ల పరిష్కారం వేగవంతం
- ఈఆర్వో జేఎస్ రామారావు
- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం


వివిధ పార్టీల ప్రజా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: నియోజకవర్గంలో చేపట్టే ఓటర్ల జాబితా సవరణలో వచ్చిన క్లెయిమ్‌ల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టామని, అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు సహకరించాలని నియోజకవర్గ ఈఆర్వో, ఆర్డీఓ జేఎస్ రామారావు కోరారు. తన కార్యాలయ చాంబర్‌లో మంగళవారం ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఓటర్ల జాబితా రీ సర్వే మరింత వేగవంతం చేసినట్టు ఈఆర్వో వారికి తెలిపారు. ఎన్నికల కమిషన్ నియమావళిపై ప్రజా ప్రతినిధులు మరింత అవగాహన పెంచుకోవాలన్నారు. ఫారం–6కు 1471, ఫారం–7కు 1343, ఫారం–8కి 757 దరఖాస్తులు అందాయన్నారు. వాటి పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని ఏఈఆర్‌ఓలను ఆదేశించారు. అనంతరం ఓటర్ల జాబితా విధానంపై ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ వి.జితేంద్ర, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, మేనేజర్ జ్యోతిరాణి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, (వైఎస్సార్ సీపీ), రంధి సత్యనారాయణ (టీడీపీ) చింతా శ్రీనివాసరావు (వైఎస్సార్ సీపీ) యినకొండ వీర విష్ణు చక్రం (వైఎస్సార్ సీపీ)లతో పాటు ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మురళీధర్, ఎంఈఓ

సామర్లకోట: స్థానిక భవిత కేంద్రం వద్ద మంగళవారం దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈఓ పి.పుల్లయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాకినాడ సీ పోర్ట్సు చీఫ్ ఆపరేషన్ అధికారి మురళీధర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సామర్లకోట భవిత కేంద్రం సిబ్బంది పనితీరుపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కేంద్రంలోని విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు, పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు. మురళీధర్ మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థుల కోసం అనేక రకాల సహాయ సహకారాలు అందిస్తోందని వాటిని సద్వినియోగం చేసుకునేలా విద్యార్థుల తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం మీనా మాధురి, భవిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకే ప్రజలు పట్టం కడతారు

ఎమ్మెల్యే పెండెం దొరబాబు


ప్రభుత్వ సంక్షేమ పథకాలను బుక్‌లెట్ ద్వారా వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు


అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దొరబాబు

కొత్తపల్లి: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రజలు మరలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి పట్టం కట్టబోతున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీలోని ఐదో సచివాలయ పరిధిలో ఉన్న 13, 14, 15 వార్డుల్లో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సెంటర్‌లో పార్టీ జెండాను ఎగురవేశారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను బుక్‌లెట్ ద్వారా వివరించి, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఈ అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా ప్రభుత్వంపై బురదజల్లుతోందని విమర్శించారు. గత టీడీపీ హయంలో, ఈ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. ఏ రాష్ట్రంలో లేనట్టుగా సచివాలయ వ్యవస్థను తెచ్చి, వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాల సేవలను అందిస్తున్నారని వివరించారు. ఇది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వ మన్నారు. మిగిలిన రాష్ట్రాలు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గంటా అప్పలస్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు వడిశెల సత్తిబాబు, దాసం లోవబాబు, గండ్రేటి శ్రీరామ చంద్రమూర్తి, జ్యోతుల భీముడు, సచివాలయాల కన్వీనర్ మొగిలి శివ, మొగిలి అయ్యారావు, దాసం పూసలు, తెడ్లపు నాగేంద్ర, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మైనం రాజా తదితరులు పాల్గొన్నారు.

ఇవ్వని హామీలూ నెరవేర్చిన జగనన్న


వాకతిప్పలో పల్లెనిద్ర చేస్తున్న ఎమ్మెల్యే దొరబాబు, నేతలు

కొత్తపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చినవే కాకుండా ఇవ్వని హామీలు కూడా నెరవేర్చి పేదల గుండెల్లో సుస్థిర స్థానం ఏర్పరచుకున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా వాకతిప్పలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు స్వగృహంలో మంగళవారం రాత్రి పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో చేసిన అభివృద్ధి, జగన్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పాలనపై ప్రజలు ఆలోచించాలన్నారు. వైఎస్సార్ సీపీకి ప్రజలు పట్టం కడుతున్నారని ఓర్వలేక ఎల్లో మీడియా, ప్రతిపక్ష నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ప్రజలు తమ ఓట్లతో వారికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉమ్మిడి చిన్న, వైస్ ఎంపీపీ శెట్టిబత్తిన సురేష్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వాకతిప్ప సర్పంచ్ నాలని దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి : రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దవులూరి

పెద్దాపురం: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని వడ్లమూరులో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ నిర్వహించారు. వైస్ ఎంపీపీ కంటే వీరప్రభావతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఆయా పథకాలను అందుకున్న ప్రతి ఒక్కరూ రెండో దఫా వైఎస్సార్ సీపీ విజయానికి తోడ్పడాలని ఆయన కోరారు. తొలుత పార్టీ జెండా, సంక్షేమం, అభివృద్ధి బోర్డును దొరబాబు ఆవిష్కరించారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, సామర్లకోట మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యం


వాకతిప్పలో పథకాల బ్రోచర్ అందజేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు అన్నారు. వాకతిప్ప సచివాలయంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయంలో సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. గృహసారథులకు, సచివాలయ కన్వీనర్లకు ప్రభుత్వ కిట్లను పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ పార్టీ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకోవాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం పేరుతో ఎమ్మెల్యేలను ప్రతి ఇంటికి పంపించారన్నారు. ఈ కార్యక్రమంతో ప్రజాప్రతినిధులను, నాయకులను ప్రతి ఇంటికి తిప్పుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వారికి వివరిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాలని దొరబాబు, గోపి హరిబాబు, రాపర్తి శ్రీనివాస్, అనుసూరి మేరీ, జ్యోతుల గంగాభవాని, మసకపల్లి దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.